నాణ్యతా లోపం.. విద్యావనరుల కేంద్రానికి శాపం

మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం భవనం

- రెండేళ్లకే పగుళ్లు తేలిన నూతన భవనం
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం.. అధికారుల పర్యవేక్షణకు నిదర్శనం

భీమారం, జూన్ 16 : నాణ్యతా లోపం.. మండల విద్యా వనరుల కేంద్రానికి శాపంగా మారింది. పనులు పూర్తిచేసుకొని రెండేండ్లు గడవక ముందే పగుళ్లు తేలింది. అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ నాణ్యతా లోపం స్పష్టంగా కనిపిస్తున్నది. సమగ్ర శిక్ష స్కీం కింద 2017-18లో నూతన భవన నిర్మాణానికి టెండర్లను పిలువగా, ఎవరూ ముందుకు రాలేదు. మళ్లీ 2021లో టెండర్లు పిలువగా, 2022లో పనులు పూర్తయ్యాయి. 2024, జనవరి 22న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉన్నా చుట్టు గోడలు బీటలువారాయి. అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ నాణ్యతా లోపంతోనే ఇలా జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రారంభమైన అనతి కాలంలో గోడలకు పగుళ్ల రావడంతో సిమెంటు పూతలు పూశారు. దీనిపై ఏఈ రాజేశ్వర్‌రెడ్డిని వివరణ కోరాగా, భూమి రేగడి భూమి అని, దానికి ఏమీ చేయలేని పరిస్థితి అని పేర్కొన్నారు. అది మేజర్ విషయమేమీ కాదని సమాధానమిచ్చారు.

పగుళ్లు తేలిన వద్ద సిమెంట్ పూతలు

భవనం ఎదుట ప్లాట్‌ఫాంపై పగుళ్లు

గోడకు మూడుచోట్ల పగుళ్లు

పాఠశాలలో సౌకర్యాల కల్పనకు కృషి

- బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచందర్
- విద్యార్థులను చేర్పించి పాఠశాల పునఃప్రారంభం
- చొప్పరిపల్లి స్కూల్‌ను కాపాడుకునేందుకు గ్రామస్తులంతా ఐక్యంగా తీసుకున్న నిర్ణయం

కొత్తగా చేరిన విద్యార్థులతో కారుకూరి రాంచందర్, గ్రామస్తులు

కాసిపేట, జూన్ 16 : ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలు, సౌకర్యాలు కల్పించి, అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రామచందర్ పేర్కొన్నారు. బెల్లంపల్లి మండలం సోమగూడెం చొప్పరిపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం గ్రామస్తుల ఐక్య సమావేశం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో మూసివేసే దశకు చేరుకున్నది. ఈ క్రమంలో పాఠశాలను కాపాడుకోవాలని, పునఃప్రారంభించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఐక్యంగా సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచందర్ మాట్లాడుతూ.. చొప్పరపల్లి పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటికే పాఠశాలలో బోరు ఏర్పాటు చేయడంతో పాటు, మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. ప్రత్యేక నిధుల ద్వారా పాఠశాల పనులు చేపట్టి, పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. పాఠశాలలో అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. చొప్పరపల్లి పాఠశాలకు ఒక ఉపాధ్యాయురాలిని కేటాయించగా, మొదటి రోజు 15 మంది విద్యార్థులు చేరినట్లు, విద్యార్థుల సంఖ్యను పెంచి అందరూ ఇదే పాఠశాలలో చేరేలా గ్రామస్తులు ఐక్యంగా నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విద్యార్థులు సరిపడా ఉపాధ్యాయులను కేటాయించేలా విద్యాధికారులతో మాట్లాడి, పోస్టులను మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ముత్తె భూమయ్య, ఎంపీటీసీ చుంచు మల్లమ్మ, మాజీ సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలా గౌడ్, జైన శ్రీనివాస్, గోమాస భీమయ్య, దుర్గం గోపాల్, బూట్ల వెంకటలక్ష్మి, దూడం మహేశ్, కుక్క రాంచందర్, చిప్పకుర్తి తిరుపతి, గురుమూర్తి, భూమ లింగం, సురేశ్, రాకేశ్, గ్రామస్తులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ దవాఖాన భవనం

లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయ భవనం

ప్రభుత్వ దవాఖానకు మున్సిపల్ భవనం ఇచ్చేదెన్నడు?

ప్రతిపాదనల సమయంలో పురపాలక బిల్డింగ్ ఇచ్చేందుకు తీర్మానం

- ఆ స్థలంలో వైద్యుల క్వార్టర్స్, పోస్టుమార్టం గది, వెయిటింగ్ హాల్, పార్కింగ్‌కు ప్లాన్..
- పూర్తికావస్తున్న హాస్పిటల్ నిర్మాణం
- ఏడాది గడిచినా అప్పగించని భవనం
- అయోమయంలో ప్రజలు, వైద్యారోగ్య శాఖ యంత్రాంగం

'లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు.. మున్సిపల్ భవనం ఇచ్చేదెన్నడు..?' అని అటు వైద్యశాఖ అధికారులు, ఇటు ప్రజలు అనుకుంటున్నారు. ఇక్కడ సకల సౌకర్యాలతో నూతనంగా నిర్మిస్తున్న దవాఖానకు.. స్థల పరిశీలన సమయంలోనే పురపాలక బిల్డింగ్ ఇచ్చేందుకు తీర్మానించినా.. దానిపై అధికారులు మాటమార్చుతుండడంతో ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిందని, మళ్లీ తీర్మానం చేయాలని కమిషనర్ సమాధానం ఇవ్వడంతో కంగుతిన్నారు. అయితే హాస్పిటల్ పనులు పూర్తయినప్పటికీ వైద్యుల క్వార్టర్స్‌తో పాటు పార్కింగ్, పోస్టుమార్టం గది, రోగుల కుటుంబ సభ్యులు ఉండేందుకు వెయిటింగ్ హాల్ లేకపోతే ప్రజలతో పాటు, వైద్యులు కూడా నానా అవస్థలు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. - లక్షెట్టిపేట, జూన్ 16

లక్షెట్టిపేట, జూన్ 16 : కేసీఆర్ ప్రభుత్వం లక్షెట్టిపేట పట్టణంలో సకల సౌకర్యాలతో ప్రభుత్వ దవాఖాన భవన నిర్మాణం చేపట్టేందుకు పూనుకున్నది. అందుకు తగ్గట్టుగానే రూ.8.5 కోట్లతో గతేడాది జనవరిలోనే పనులు ప్రారంభించింది. ప్రస్తుతం పనులు పూర్తికావస్తున్నాయి. 70 నుంచి 80 శాతం పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు.

స్థల పరిశీలన సమయంలోనే తీర్మానం

పాత భవనం కూల్చివేసి, కొత్త భవనం నిర్మించాలని ప్లాన్ వేసిన అధికారులు.. స్థలం సరిపోకపోవడంతో పక్కనే ఉన్న మున్సిపల్ కార్యాలయ భవనం కూడా అప్పగించాలని నిర్ణయించారు. ఆ స్థలంలో వైద్యుల కోసం క్వార్టర్స్‌తో పాటు పార్కింగ్, పోస్టుమార్టం గది, రోగుల కుటుంబ సభ్యులు ఉండేందుకు వెయిటింగ్ హాల్ నిర్మించేందుకు ప్లాన్ చేశారు. పనులు ప్రారంభించే 3 నెలల ముందుగానే మున్సిపల్ అధికారులకు పాలకవర్గం సమాచారం ఇచ్చింది. దీంతో మున్సిపల్ భవనం ఇచ్చేందుకు అంతా తీర్మానం చేశారు. అలాగే మున్సిపల్ కార్యాలయాన్ని పాత బస్టాండ్ సమీపంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి మార్చాలని కూడా నిర్ణయించారు. అదే క్రమంలో గతేడాది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కూడా పాత ఎంపీడీవో కార్యాలయం వెనుకాల గల పంచాయతీ రాజ్ భవనంలోకి మార్చేశారు.

మళ్లీ తీర్మానించాలంటున్న కమిషనర్..

అన్నీ సజావుగా సాగుతున్న తరుణం.. పనులు పూర్తికావస్తుండడంతో మున్సిపల్ భవనం ఆరోగ్య శాఖకు అప్పగించాలని ఆ శాఖ అధికారులు కోరారు. అదే సమయంలో ఎన్నికలు రావడంతో కోడ్ ముగియగానే భవనం అప్పగిస్తామని మున్సిపల్ కమిషనర్ చెప్పారు. దీంతో అధికారులు ఇంతకాలం వేచి చూశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు పూర్తవడం, కోడ్ ముగియడంతో భవనం ఇవ్వాలని మెడికల్ సూపరింటెండెంట్ ఆకుల శ్రీనివాస్.. కమిషనర్‌ను కోరారు. అయితే ప్రభుత్వం మారిందని, మళ్లీ తీర్మానం చేయాలని సమాధానం ఇవ్వడంతో అసలు భవనం ఇస్తారా..? లేదా..? అనే ప్రశ్న మిగిలిపోయింది. మున్సిపల్ భవనం ఇవ్వకపోతే కొత్త భవనంలో కూడా దవాఖానకు చాలా సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుత దవాఖానను అన్ని వసతులతో నిర్మిస్తున్నారు. భవనం పూర్తయినప్పటికీ వైద్యుల క్వార్టర్స్‌తో పాటు పార్కింగ్, పోస్టుమార్టం గది, రోగుల కుటుంబ సభ్యులు ఉండేందుకు వెయిటింగ్ హాల్ లేకపోతే ప్రజలతో పాటు, వైద్యులు కూడా నానా అవస్థలు పడాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

❖ గతేడాదే ఇస్తామన్నారు..

లక్షెట్టిపేట పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ దవాఖానకు స్థలం సరిపోకపోవడంతో పక్కనే ఉన్న మున్సిపల్ కార్యాలయ భవనం ఇస్తామని గతేడాది చెప్పారు. పనులు మొదలు పెట్టండి, పూర్తయ్యేలోగా భవనం మరో చోటికి మార్చి, అప్పగిస్తామన్నారు. అందుకు తీర్మానం అయ్యింది. ఎన్నికలు రావడంతో కోడ్ ముగియగానే ఇస్తామన్నారు. మున్సిపల్ అధికారులను ఇప్పుడు అడిగితే ప్రభుత్వం మారింది, మళ్లీ తీర్మానం చేయాలంటున్నారు. ఆ భవనం ఇవ్వకపోతే పోస్టుమార్టం గదితో పాటు, వైద్యుల క్వార్టర్స్, రోగుల కోసం వెయిటింగ్ హాల్, పార్కింగ్ సదుపాయం ఏవీ లేక మళ్లీ నానా ఇబ్బంది పడాల్సి వస్తుంది. - ఆకుల శ్రీనివాస్, సూపరింటెండెంట్, ప్రభుత్వ దవాఖాన

❖ తీర్మాణం వాస్తవమే.. ప్రభుత్వం మారింది..

గత ప్రభుత్వంలో దవాఖాన భవనం కోసం ప్రస్తుత మున్సిపల్ కార్యాలయ భవనం ఇచ్చేందుకు తీర్మానం చేసిన విషయం నిజమే. మున్సిపల్ కార్యాలయాన్ని పాత బస్టాండ్ సమీపంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి మార్చాలని కూడా నిర్ణయించాం. ఎన్నికల కోడ్ ముగియగానే ఇస్తామన్నాం. కానీ, ప్రభుత్వం మారింది. కొత్త ప్రభుత్వం వచ్చింది. కాబట్టి మళ్లీ పాలకవర్గంతో సమావేశం ఏర్పాటు చేసి, కలెక్టర్‌తోపాటు, ఉన్నతాధికారులతో మాట్లాడిన తర్వాతనే వారి ఆదేశాల మేరకు తరుపరి నిర్ణయం తీసుకుంటాం. గతంలో భవనం ఇవ్వాలని అధికారులు చెప్పింది కూడా నిజమే.

- కల్లెడ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్, లక్షెట్టిపేట

నేటి నుంచి విద్యుత్ ప్రజావాణి

జైనూర్, జూన్ 16 : విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17 వ తేదీ నుంచి ప్రతీ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఇన్‌చార్జి ఏఈ సాయికిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు గమనించి, సమస్యలుంటే ప్రజావాణిలో దరఖాస్తు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కౌటాలలో..

కౌటాల, జూన్ 16 : కౌటాల సబ్ డివిజన్ పరిధిలో సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కౌటాల ఏడీఈ రాజేశ్వర్ తెలిపారు. కౌటాల సబ్ డివిజన్ పరిధిలోని కౌటాల, సిర్పూర్(టీ), బెజ్జూర్ సెక్షన్లలో ఉంటుందని, కౌటాల, సిర్పూర్(టీ), చింతలమానేపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట మండలాల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెద్దమ్మ తల్లి బోనాలు

ఆలయం ఎదుట పట్నాలు వేసిన పూజారులు

దండేపల్లి, జూన్ 16 : దండేపల్లి మండలం మామిడిపెల్లిలో ఆదివారం ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లికి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయం ఎదుట పూజారులు పట్నాలు వేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు, భక్తులు ఉన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

మందమర్రి, జూన్ 16 : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, కొత్తగూడెం జిల్లా మనుగూరులో హత్యకు గురైన చిన్నారుల ఆత్మకు శాంతిచేకూరాలని కోరుతూ మందమర్రి పట్టణంలో ఆదివారం భగత్‌సింగ్ యువత స్వచ్ఛంద సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. మార్కెట్‌లో ప్రారంభమైన ర్యాలీ సింగరేణి పాఠశాల వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. చిన్నారి సహస్ర చిత్ర పటం వద్ద సంఘం సభ్యులు నివాళులర్పించారు. ఆఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ యువత సభ్యులు కిరణ్, బియ్యపు రవికిరణ్, చెరుకు వంశీ, అభిలాశ్, చోటు, అవినాశ్, సాత్విక్, అఖిల్, స్వామి, శివసాగర్, ప్రమోద్, అంజి, చింటు, వినోద్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

మందమర్రి, జూన్ 16 : పట్టణానికి చెందిన రాధాకృష్ణ జిమ్‌లో వ్యాయామం చేస్తూ ప్రమాదానికి గురై, చికిత్స పొందుతున్నాడు. ఎముకలకు తీవ్రగాయాలవడంతో ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. రాధాకృష్ణ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చేయూతనందించారు. దాతల సహకారంతో విరాళాలుగా సేకరించిన రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రజాసేవా వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్, సభ్యులు నందిపాటి రాజ్‌కుమార్, గాండ్ల సంజీవ్, సకినాల శంకర్, ఎండీ జావీద్‌పాషా, చింటు పాల్గొన్నారు.

పెగడపల్లిలో మాట్లాడుతున్న ఏఐకేఎస్ జిల్లా కమిటీ సభ్యుడు దాగాం రాజారాం

18న ధర్నాను జయప్రదం చేయండి

తాండూర్, జూన్ 16 : తెలంగాణ ఆదివాసీ గిరిజన, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంచిర్యాల కలెక్టరేట్ ఎదురుగా జూన్ 18న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా కమిటీ సభ్యుడు దాగాం రాజారాం పిలుపునిచ్చారు. మండలంలోని పెగడపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అటవీ శాఖ అధికారుల దౌర్జన్యాలను ఈ ప్రభుత్వం అరికట్టాలని, పోడు భూములను అర్హులైన రైతులు ట్రాక్టర్లతో దున్నుకొనివ్వాలని, పట్టా పాస్ బుక్కులు ఇచ్చిన వారికి రుణాలు, 25 ఏండ్ల నుచి పోడు వ్యవసాయం చేస్తున్న అర్హులకు పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐఏడబ్ల్యూయూ) తాండూర్ మండలాధ్యక్షుడు వేల్పుల శంకర్, గిరిజన సంఘం నాయకులు, రైతు సంఘం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

కాసిపేట : కిట్లను పంపిణీ చేస్తున్న ఏసీపీ

కాసిపేట, జూన్ 16 : విద్యార్థులు, యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి సూచించారు. పోలీసులు మీ కోసంలో భాగంగా కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యంపల్లి, దుబ్బగూడెం గ్రామాలు, దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి గర్రాంప్‌పల్లి, సోనాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల క్రీడాకారులకు వేర్వేరుగాక్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

మామిడిగట్టులో..

మందమర్రి, జూర్ 16 : రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మామిడిగట్టు లో ఎస్ఐ రాజశేఖర్ యువకులకు వాలీబాల్‌లు, క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. క్రీడలపై దృష్టి పెట్టాలని, లక్ష్యాన్ని ఎంచుకొని సాధించాలని సూచించారు. యువకులు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలిన సూచించారు. పోలీసుల సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో..

కన్నెపల్లి, జూన్ 16 : కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి మెట్‌పల్లి యువకులకు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

కిష్టంపేట, అంకుశంలో..

తాండూర్, జూన్ 16 : తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధి కిష్టంపేట, అంకుశం గ్రామాల యువకులకు తాండూర్ ఎస్ఐ సీహెచ్ కిరణ్ కుమార్ క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణ్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చిత్రకారులను గుర్తించాలి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 16 : రాష్ట్రంలోని చిత్రకారులందరినీ ప్రభుత్వం గుర్తించాలని, సంక్షేమానికి పాటుపడాలని ఆర్టిస్టుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ కోరారు. జిల్లా కేంద్రంలోని చిత్ర పతి శివాజీ భవన్‌లో ఆదివారం తెలంగాణ ఆర్టిస్టుల సంక్షేమ సమితి జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. తాళ్లపల్లి రాజేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. సంఘ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు రమణ, శంకర్, సత్య కళ సత్యనారాయణ, సత్యనారాయణ, రాజ్‌నాథ్, యాదగిరి, మల్లేశం, వివిధ జిల్లాల ఆర్టిస్టులు, ఆసిఫాబాద్ జిల్లా ఆర్టిస్టులు పాల్గొన్నారు.


2008-09 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అ'పూర్వ' సమ్మేళనం

భీమారం, జూన్ 16 : భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2008-09 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఒకరినొకరు పలకరించుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాటు సామూహిక భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిహారం అందేదాకా పోరాడుతాం

దహెగాం, జూన్ 16 : కిరాతకంగా హత్యకు గురైన ఆరేండ్ల చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం అందే దాకా పోరాడుతామని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శెట్టుపల్లి శివాజీ అన్నారు. రాష్ట్ర నాయకత్వంతో కలిసి ఆదివారం దహెగాం మండల కేంద్రంలోని చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా చిన్నారి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు, కుటుంబంలో ఒకరికి జూనియర్ అసిస్టెంట్ స్థాయికి తగ్గకుండా ఉద్యోగం ఇవ్వాలని, అలాగే ఐదెకరాల భూమి అందించాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగూర్ల వెంకన్న, కన్వీనర్ జెండా రాజేశ్, నాయకులు మోల్తాల్ల రాంచందర్, రాంబాబు, మోటె చిరంజీవి, ఎంపీపీ డుబ్బుల నానయ్య, జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరామ్, మండలాధ్యక్షుడు తుమ్మిడ నారాయణ, నాయకులు చప్పిడ సత్యనారాయణ, అల్లం మల్లేశ్, బోర్కుట్ తిరుపతి, సంతోష్ గెడేకార్, డోకె ధామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటిని చంపానన్న అనుమానంతో

చితకబాది చేయి విరగ్గొట్టారు

- పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతు అప్పాజీ శ్రీనివాస్ ఫిర్యాదు

ఫిర్యాదు పత్రం చూపుతున్న రైతు శ్రీనివాస్, నాయకులు

పెంచికల్ పేట్, జూన్ 16 : సంబంధం లేని విషయంలో అదుపులోకి తీసుకొని, చిత్ర హింసలకు గురిచేసి చేయివిరగొట్టిన ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు, రైతు అప్పాజీ శ్రీనివాస్ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అగర్‌గూడ అటవీ సమీపంలో ఎలుగుబంటిని హత్యచేశాన్న అనుమానంతో ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్ తనను మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు అదుపులోకి తీసుకున్నారని తెలిపాడు. రేంజ్ కార్యాలయంలో బంధించి చిత్రహింసలకు గురిచేశారని, ఎలుగుబంటిని చంపినట్లు ఒప్పుకోవాలని చితకబాదారని వాపోయాడు. ఈ క్రమంలో తన చేయి విరగొట్టారని ఆరోపించాడు. విచారణ జరిపించి, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వోపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కొమురయ్యను కోరాడు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్‌ను 'నమస్తే' వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీనివాస్‌పై అనుమానంతో అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. చితకబాది చేయి విరగొట్టడం నిజంకాదని వివరించారు.

బెజ్జూర్‌లో డీఎస్పీ విచారణ

కాగజ్‌నగర్, జూన్ 16: కాగజ్‌నగర్ డివిజన్ బెజ్జూర్ మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన భూతగాదాలు, ఇతరాత్ర గొడవల నేపథ్యంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆదివారం విచారణ చేపట్టారు. ఇటీవల మర్థడి గ్రామ శివారులో భూతగాదాల్లో ఇరువర్గాల మధ్య గొడవ జరుగగా, వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇదే క్రమంలో ఆదివారం కూడా కొంతమంది బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. భూ తగాదాలో ఒకరిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలవగా, ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ విక్రమ్‌ను సంప్రదించగా, ఇప్పటి వరకు కేసు నమోదు చేయాలేదని స్పష్టం చేశారు. ఆదివారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్.. ఎస్పీ, ఎస్పీ అట్రాసిటీ కేసుల విషయంలో విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జన్నారం, జూన్ 16 : మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికి చెందని సోమారపు ఉశాలు(50) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. మహ్మదాబాద్ నుంచి చింతగూడకు స్కూటర్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి

తాండూర్, జూన్ 16 : బిహార్‌కు చెందిన నితీశ్‌కుమార్(19) తాండూర్ మండల పరిధిలో ఆదివారం ప్రమాద వశాత్తు రైలు కింద పడి మృతిచెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. నితీశ్‌కుమార్ చెన్నైలో 6 నెలలుగా ఉపాధి పొందుతున్నాడు. అక్కడి నుంచి సంఘమిత్రా రైలులో బిహార్ రాష్ట్రం దానాపూర్‌లోని ఇంటికి బయల్దేరాడు. రైలు రేపల్లెవాడ జిన్నింగ్ మిల్ సమీపంలోకి చేరుకోగానే, అదుపు తప్పి రైలు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేశ్ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని, పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టు మార్టం చేయించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఉచిత వైద్య శిబిరం

సీసీసీ నస్పూర్, జూన్ 16 : హైదరాబాద్ కేర్ హాస్పిటల్ సహకారంతో శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం ఆధ్వర్యంలో సీసీ సీ ఎల్లందు క్లబ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అధికారులు వారి కుటుంబ సభ్యులకు గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేశారు. వైద్యులు ప్రియ కాంతిలాల్ షా, కిరణ్‌బాబు, కేర్ దవాఖాన లైజన్ ఆఫీసర్ టూ ఎస్‌సీసీఎల్ ఏజీఎం ఎన్వీ రాజేశ్వర్‌రావు, సిబ్బందితో కలిసి 120మందికి పరీక్షలు చేశారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఎస్‌వటూ జీఎం పురుషోత్తంరెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కోశాధికారి బానోత్ రాము, ఎస్టీపీపీ సీఎంవోఏఐ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, సింగరేణి వైద్యులు రమేశ్‌బాబు, లోకనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

మంచిర్యాల ఏసీపీ, జూన్ 16 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఎగ్గెన అంజన్న ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. అంజన్న కూలీ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకున్నాడు. అంజన్నకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫ